క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక సోదరులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రం వెల్దుర్తిలో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపట్టే సమ్మెకు ప్రజలు, ప్రజాతంత్రవాదులు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాల పంపిణీ



సరకులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాథోడ్ లక్ష్మీబాయికి, నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన గొల్లమల్లప్ప, ప్రేమలకు జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ ప్రతినిధులు ఆదివారం నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకోవడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, తుకారాం, శ్రీనివాస్ సాగర్, అభివార్ పాల్గొన్నారు.

భూభారతికి 1690 దరఖాస్తులు

తహసీల్దార్ తులసిరాం



టేక్మాల్(మెదక్): ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు మండలంలో పూర్తయినట్లు తహసీల్దార్ తులసిరాం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 21 వరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ భూభారతి సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. పలు రకాల భూసమస్యలతో 1690 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి పైఅధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. రైతులెవ్వరూ భూసమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

స్నేహితురాలికి చేయూత



ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న స్నేహితురాలికి బాల్య స్నేహితులు చేయూతనందించారు. మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన వడ్ల మాధవికి మియాపూర్‌కు చెందిన యాదగిరితో వివాహం జరిగింది. అనారోగ్యంతో యాదగిరి మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లలతో మాధవి తల్లి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తూ జీవనోపాధి పొందుతుంది. విషయం తెలుసుకున్న 2011–2012 విద్య సంవత్సరం పదవ తరగతి మాధవి బాల్యస్నేహితులు రూ.40 వేల ఆదివారం అందజేశారు. దీంతో తన స్నేహితులు ఆర్థికసాయం చేయడంపై మాధవి కృతజ్ఞతలు తెలిపారు.

రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికల నిర్వహణ

బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు పాండు



సమావేశంలో మాట్లాడుతున్న పాండు

సంగారెడ్డి : బీసీ రిజర్వేషన్లు 42 శాతం కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల నిర్వహించాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు తాటిపల్లి పాండు డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలో బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడంతో చాలా నష్టపోయామని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మల్లయ్య, రమేష్, జగదీశ్వర్, బాలుయాదవ్ పాల్గొన్నారు.

పాలిథిన్.. పాయిజన్!

పర్యావరణానికి ప్లాస్టిక్ కవర్ల ముప్పు

- మృత్యువాత పడుతున్న పశువులు
- పట్టించుకోని అధికారులు



జహీరాబాద్ పట్టణంలో కవర్లు తింటున్న పశువులు

జహీరాబాద్ టౌన్: పాలిథిన్ కవర్లు తిని ఈ నెల 18న ఓ ఆవు మృతి చెందింది. జహీరాబాద్ పట్టణంలో రోడ్లపై సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లు తిని అస్వస్థతకు గురైంది. చికిత్స అందించిన మూడు రోజుల తరువాత చనిపోయింది. పాలిథిన్ కవర్లు తిని పశువులు తరుచూ మృత్యువాత పడుతున్నాయి. పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నా ఎక్కడ అమలు కావడం లేదు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమైంది. చిరు వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. కిరాణా షాపులు, కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్, టిఫిన్ బండ్లు, మాసం దుకాణాలు ఖాళీ ప్రదేశాలు, మురికి కాలువలు ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కవర్లు ముంచెత్తుతున్నాయి. కవర్లకు తోడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వాడకం పెరగడంతో మురికి కాలువలు, రోడ్ల పక్కన కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి.

క్షేత్రస్థాయిలో విఫలం

మున్సిపల్ పరిధిలో కవర్ల నిషేధం పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. వ్యాపారులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. కరపత్రాలను పంచారు. 40మైక్రోన్స్ కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను వాడరాదని ఆదేశించారు. జ్యూట్ బ్యాగులు, బట్ట బస్తాలు వినియోగించాలని చెప్పారు. తనిఖీలు నిర్వహించి కొంత మందికి జరిమానాలను విధించారు. కొన్ని రోజుల తరువాత యథేచ్ఛగా కవర్లను వినియోగిస్తున్నారు.

175 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి

జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, అందోల్ మున్సిపాలిటీల్లో సుమారు 175 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.అందులో 60 మెట్రిక్ టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. పాలిథిన్ కవర్లను వాడటం వల్ల అనేక అనార్థాలు చోటు చేసుకుంటున్నాయి. పశువులు వీటిని తినడం వల్ల అనారోగ్య బారిన పడుతూ చనిపోతున్నాయి. పర్యావరణానికి హానికలిగిస్తూ ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయన్నారు. పెళ్లిళ్లు తదితర శుభకార్యాలయాలు సమయంలో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లను ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన, మురికి కాలువల్లో కవర్లు పారబోయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు ఎదురవుతున్నాయి. మున్సిపల్ అధికారులు పాలిథిన్ కవర్ల వాడకాన్ని తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లగా క్యారీ బ్యాగ్స్ నిషేధానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కవర్లు అమ్మినా.. వాడినా జరిమానా విధిస్తామన్నారు. ప్రజలు మార్కెట్‌కు వెళ్లినప్పుడు బట్ట సంచులు తీసుకెళ్లాలని సూచించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నరసింహారెడ్డి, నేతలు

పటాన్‌చెరు టౌన్: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రైతు భరోసా విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు రూ.8,565 కోట్లను రైతు భరోసా కింద వారి జమ అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. తెలంగాణ ఉద్యమంలో వందలాది విద్యార్థుల ఆత్మబలిదానాలకు కారకుడైన హరీశ్‌రావు మరొకసారి జిన్నారం రైతులను రెచ్చగొట్టి వారిని వారి కుటుంబాలకు నష్టాన్ని కలిగించే పక్కా ప్రణాళికలో ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, జీ పీసీసీ కార్యదర్శి మతిన్, టౌన ఉపాధ్యక్షుడు యువరాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు మల్లేశ్‌యాదవ్, అక్షిత్ హనుమంతు, నాయకులు విజయ్, నాగయ్య, అశోక్ , రమేష్ ,సంజయ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మాజీ చైర్మన్‌కు పరామర్శ



వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గుండ్లపల్లి గ్రామానికి చెందిన నర్సాపూర్ ఆత్మక మిటీ మాజీ చైర్మన్ గౌరె వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంకట్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు హరికృష్ణ, మన్సూర్, రమాకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లీఫార్మా పరిశ్రమ, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సభ్యులతో కలిసి మాజీ సర్పంచ్ ప్రకాశంచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ ఐ హాస్పిటల్ వైద్య బృందం పారిశ్రామికవాడలోని పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కోమల్ రెడ్డి, ప్రకాష్, నరేందర్ బాబు, ఎంఎస్‌రెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌ల ప్రమాణ స్వీకారం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ ఫంక్షన్ హాలులో ఆదివారం వీర శైవ లింగాయత్ మండల, గ్రామాల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం చేశారు. వీర శైవ లింగాయత్ మండల అధ్యక్షుడిగా సంగమేశ్వర్ పాటిల్, ఆయా గ్రామాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఇందూర్ ఆశ్రమ నిర్వహకులు చిన్న మల్లికార్జునస్వామి, వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు నర్సింలు, నాయకులు రాజేశ్వర్, మల్లికార్జున్, అరుణ, వివిధ గ్రామాల లింగాయత్ సమాజ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభించిన శ్రీశైలంయాదవ్

సంగారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ సీనియర్ నాయకుడు కర్కం శ్రీశైలం యాదవ్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డు గొల్లగూడెం కాలనీలో కొన్ని సంవత్సరాల నుంచి మురికి నీరు పోవడానికి కాలువలు సరిగ్గా లేక అవస్థలు పడుతున్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం శ్రీశైలంయాదవ్ అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల తర్వాత మురికి నీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిరణ్‌గౌడ్, సతీష్‌రెడ్డి, రాంరెడ్డి, కాలనీవాసులు రాజేశ్వర్, మాణిక్యం, నవీన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ వద్ద ఉద్రిక్తత



సీఐతో మాట్లాడుతున్న ప్లాట్ల యజమానులు

పటాన్‌చెరు: మండలం పరిధి ఇంద్రేశం గ్రామంలోని వికాస్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ప్లాట్ల యజమానులను వెంచర్ల లోపలికి వెళ్లనివ్వకుండా గేటు వేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్లాట్ల యజమానులు వెంచర్ అభివృద్ధి నిమిత్తం మాట్లాడుకునేందుకు వచ్చి ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సీఐ వినాయక్ రెడ్డి వచ్చి ఇరు వర్గాల వారితో మాట్లాడారు. ప్లాట్లు యజమానులు లోనికి రానివ్వకుండా అడ్డు చెప్పవద్దని సొసైటీ సభ్యులను హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే రెండు రోజుల తర్వాత ఇరు వర్గాల వారు దస్త్రాలు తీసుకు వస్తే సమస్యను పరిష్కరిస్తానని సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి**

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే కొనసాగుతున్నాయని మండల బీజేపీ నాయకులు తెలిపారు. ఆదివారం మండలంలోని రామాయపల్లిలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో రచ్చబండ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మోదీ ప్రవేశపెట్టిన పథకాలు, రాష్ట్రానికి ఇచ్చిన నిధుల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పురం మహేశ్, నరేందర్ చారి, గ్రామ అధ్యక్షుడు రితేష్, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

◆ **బీటీరోడ్లకు నిధులు మంజూరు చేయండి**

పాపన్నపేట(మెదక్): మెదక్ నియోజకవర్గంలో బీటీ రోడ్ల మంజూరుకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం పంపినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూసుఫ్‌పేట నుంచి అన్నారం, ఆరెపల్లి నుంచి పాటిగడ్డ, ఆరెపల్లి నుంచి పుట్టిగడ్డ, కుర్తివాడ నుంచి దేవుని పల్లి వరకు బీటీ రోడ్లు, మెదక్ పట్టణంలో సీసీరోడ్లు, పాపన్నపేటలో సీసీ రోడ్లు, రామాయంపేటలో సీసీరోడ్లు,సైడ్ డ్రైయిన్స్ మంజూరు చేయాల్సిందిగా సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

◆ **సీఎం సహాయనిధితో లబ్ధి**

వట్‌పల్లి(అందోల్): సీఎం సహాయనిధి పేదల వైద్య ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాడెం శివనీలకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు.

◆ **నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్స్‌పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేష్, విష్ణున్ శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీశారు. ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. గౌడజనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రం కృష్ణగౌడ్, విజయ్‌గౌడ్ అమ్మవారిని దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

◆ **నోట్ పుస్తకాల పంపిణీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో ఆదివారం మనం గ్రూప్ అడ్మిన్ సురేందర్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభివృద్ధి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం చేయాలన్నారు.

◆ **క్రీడాస్ఫూర్తిని చాటే ఒలింపిక్ దినోత్సవం**

చిన్నశంకరంపేట(మెదక్): ఒలింపిక్ దినోత్సవం క్రీడాస్ఫూర్తిని చాటడంతో పాటు కొత్త క్రీడలకు నాంది పలికేందుకు ప్రతి ఏటా జూన్ 23న ఒలింపిక్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు చిన్నశంకరంపేట మండలం మడూర్ జెడ్పీ పాఠశాల పీడీ డాక్టర్ నరేష్ తెలిపారు. ఆదివారం విద్యార్థులకు ఒలంపిక్ క్రీడల విశిష్టత గురించి వివరించారు. క్రీడల్లో మహిళలు, పురుషులు, చిన్నారులు పాల్గొనడంతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రతి ఏటా జాతీయ ఒలింపిక్ డే నిర్వహించడం జరుగుతుందన్నారు. నేర్చుకొండి, అన్వేషించండి అనే నినాదాలతో ఒలింపిక్ రన్ నిర్వహించి క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 1కే రన్ నుంచి 5కే రన్ వరకు నిర్వహించాలన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

సీఐ వినాయక్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న సీఐ వినాయక్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పాటుపడాలని పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలం పరిధి ఇంద్రేశం వికాస్ అసోసియేషన్ సభ్యులకు యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడమే ఈ వార్షికోత్సవ లక్ష్యం అన్నారు. సే నో–టు డ్రగ్స్ అనే నినాదం ప్రతి ఒక్కరి దాకా చేరేలా చూడాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తాయి. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్లు, ప్లాట్ ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం రైతన్న ఎదురుచూపులు

మునిపల్లి(అందోల్): పత్తి పంటకు పెట్టిన పెట్టుబడిని రాబట్టుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. పత్తి విత్తన నాటి నుంచి వర్షం పడక మొక్కలు ఎక్కడ ఎండిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో కూలీలకు రోజుకు 8 వందల రూపాయల చొప్పున కూలీ ఇచ్చి మొక్కలకు నీళ్లు పోయిస్తున్నారు. ఆదివారం మండలంలోని గార్లపల్లిలో ఓ రైతు బిందెలతో పత్తి మొక్కలకు నీళ్లు పోయిస్తున్నారు. ఇంకొందరు బోరు మోటార్ సహకారంతో స్ప్రింకర్లతో నీళ్లు పెట్టుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేలపైన పెట్టుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. వర్షం పడగానే విత్తనాలు విత్తామని మొక్కలు మొలకెత్తాక వర్షం పడకపోవడంతో బిందెలతో, స్ప్రింకర్లతో నీళ్లు పోస్తున్నట్లు వాపోయారు.

స్థానిక ఎన్నికల కోసమే హడావిడి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు హడావిడి చేస్తున్నారని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రైతు భరోసా కింద సహాయం రూ.15 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు హామీనిచ్చి రెండు విడతలు ఇవ్వకపోగా ప్రస్తుతం రూ.12 వేలకు పరిమితం చేశారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజల పేరిట సందడి చేస్తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే లబ్ధిదారుల ఖాతాల్లో అడ్వాన్సుగా బిల్లులు వేసి నిర్మించుకునేలా చేయాలన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వరాచారి, ముజమ్మిల్, సంగప్ప, వెంకటేశం, మల్గొండ, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

కంది(సంగారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కంది, సంగారెడ్డి మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీతో ఉన్న వారందరినీ ఆదుకుంటామన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఆంజనేయులు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత కిషన్, చిన్నా ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను ఆచరించాలి



సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ భగవద్గీతను ఆచరిస్తూ తమ జీవితాలను సుఖమయం చేసుకోవాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ అన్నారు. ఖేడ్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, అలంకరణ, హారతి, కార్యక్రమాలతో పాటు సామూహిక కుంకుమార్చనలు, హోమం, చప్పన్‌భోగ్ ప్రసాదాల సమర్పణ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, రాధాస్వామి సత్సంగ్ భక్తుడు రామకృష్ణ పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంకు చెందిన క్రిష్ణమూర్తి బృందం సంగీత విభావరి నిర్వహించారు. భక్తులకు ఉపాధ్యాయులు శివరాంపల్లి విజయ్ కుమార్, భారతి దంపతులు మహాప్రసాదాన్ని అందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): మత్తు పదార్థాలకు అలవాటు పడి కొందరు విలువైన జీవితాలను పాడు చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ అన్నారు. న్యాల్‌కల్‌లోని ఎస్‌బీఐ ఆవరణలో మాదక ద్రవ్య నిర్మూలన కార్యక్రమంపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. మత్తు పదార్థాలు వినియోగించడం, సరఫరా చేయడం నేరమన్నారు. డ్రగ్స్ వినియోగించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్యస్వామి, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా 165వ నగర సంకీర్తన



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని గడి ప్రాంతంలో ఆదివారం 165వ నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారు జామున శివాలయంలో పూజలు నిర్వహించి నగర సంకీర్తన పాదయాత్ర ప్రారంభించారు. శివాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కాలనీ అంతట కొనసాగింది. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. అనుగ్రహ భాషణ చేశారు. ఆత్మవిశ్వాసానికి ఆత్మస్థైర్యం తోడతై అపజయం ఉండదన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అల్పాహారం అందజేశారు.

టెంపుల్ బెల్ బహూకరణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ చెందిన సంతోష్‌కుమార్ పిల్లకుంటతండాలోని జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయానికి హిందు టెంపుల్ బెల్‌ను బహూకరించారు. హిందు టెంపుల్ బెల్ మైక్‌సెట్‌కు అమర్చడంతో ప్రతి గంటలకు సమయం చెప్పడంతో పాటు భగవత్‌గీత శ్లోకాలు వినిపిస్తాయని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

సంగారెడ్డి: సంగారెడ్డి టౌన్–2 పరిధిలో సోమవారం ఉ.10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సంతోశ్ తెలిపారు. చెట్ల కొమ్మలు నరికివేత, 11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా శాంతినగర్, కల్వకుంట రోడ్, నటరాజ్ థియేటర్ రోడ్డు, రాజీవ్ పార్క్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.